# నిశాకాంత

శ్రీమతి కృష్ణాకుమారిగారు

ఉషఃకాలమున నే తన్ను చూచి తనసవతి పగటి పడుచు కిలకిలనవ్వి అవమానం చేసింది. ఆ యవమానాన్ని సహించుకో లేకపోయింది నిశాకాంత. పేదరాలి కోపం పెదవులకు చేటన్న ట్లప్పటి తన దౌర్బల్యం చేత "కిమ్మనకుండా ఊరుకుంది. కాని లోపల కోపం లేక పోలేదు; నిశాకాంతకు.

ఇంకిప్పుడు తనరాజ్యం వచ్చింది. తన ప్రతాపం చూపడానికి మొదలుపెట్టింది. ముందు ముఖం మెత్త జేసింది. దానికే పగటిపడుచు ముసలిదై పోవడంచేత హడలెత్తి తనసవతిధాటీ కాగలేక తలవంచుకొంది. తన ప్రథమప్రయత్నమే కొనసాగినందులకా నిశాటి యెంతసంతోషించి యున్ని దేవుళ్ళకు మొక్కుకున్నదో యెవరికి తెలుసు?

అక్కణ్ణుంచి పక్షుల కిలకిలారావాలతో తన సవతికి యుద్ధానికి రాయబారాలు జరిపింది. ఆ కిలకిలారావాలతో సవతిని దూషించిందని కొందఱంటారు. అతి కోపం ఏడ్పులోకి మారుతుంది కనుక ప్రొద్దుటినుంచీ ఉన్న కోపాన్నాపుకోలేక యేడ్చిందనంటారు కొంతమంది.

ఏదియేలాగైతే మనకేం? మనమేమార్చేవాళ్ళమా? తీర్చేవాళ్ళమా?

తన యే ద్వారణ్యరోదనము కాగా, ఎవరూ వినక పోతే మొగమెఱ్ఱబడేట ట్లేడ్చేడ్చి చివఱకూరుకొందని కొంద ఱంటారు.

అంతటితో ఊరుకొందా! లేదు. కొంతకాలము నుంచీ తన సవతిరాజ్యంలో సుఖపడి, తన సవతికి బంధువులు ప్రియతమములునైన పద్మములను తనసవతికి బుద్ధిచెప్పమనో, లేక శత్రురాజ్ఞి రాజ్యములోని వారినో చీవాట్లుపెట్టి తలలెత్తకుండా చేసింది. తన జయాన్ని తెలుపడానికి కాబోలు శాత్రవులైన చక్రవాకాల్ని బంధు విరహాగ్ని సంతప్తులనుగాజేసి వారి ప్రేమ ధనాన్ని దోచుకొంది. ఆతరువాత తన అంధకార పతాకాన్ని పైకెత్తి దానిక్రింద తన ప్రజలకు కుముదినులకు తావోసగి వారలను సంతోషపఱచింది.

పరిహాసమాత్రాననే తన సవతిపై నిశాకాంత ఈర్ష్యయెందులకో?

ఇంక తనభర్త కాలపురుషుఁడు వచ్చేసమయమయింది. కాని తాను వాసవసజ్జిక కాలేదు. ఖండిత నాయికాలలామ యయింది. భర్త వచ్చేటప్పటికి చెంగోగలంచు నల్లకోక కాళ్ళవ్రేళ్ళు జీరాడునట్లు కట్టింది. అదివఱకు తలలో ముడుచుకొన్న పూవుల నన్నిటి నెగజిమ్మింది. వానినే నక్షత్రాలన్నారు. చూడామణినిదీసి కోపముకొద్దీ నేలకేసికొట్టింది. తళ్ళుకెమో అన్నట్లా చూడామణి వంకలుపోయి పదహారుముక్కలై పంచ బంగాళమైపోయింది. ఓ ముక్క యీశాన్యంగాపోతే, దాన్నీశ్వరుఁడు తీసుకొని యింతవఱకీయ్యేలేదు. కొన్నాళ్ళసలు చూడామణి కనబడనేలేదు. ఆచూడామణినే యీకవులంతా జాబిల్లి, చందమామ, మృగాంకుఁడనియే వేవో పేర్లు పెట్టి పిలుస్తున్నారు. తన నెచ్చెలులైన చకోరాలు హితవు చెప్పదలచికూడ యీ సమయంలోవస్తే తమ్మెంత హైన్యంగా చూస్తుందోనని దగ్గఱకైనా రాకుండా దూరంగా తొలగిపోయాయి. కొన్నివచ్చి కూడ తగినసత్కారం పొందక అవమానంతో వంచిన తలలెత్తకుండా వెళ్ళిపోయాయి.

ఇదంతా చూస్తూన్న కాలపురుషుడు తన ప్రియురాల్ని శాంతింపజేద్దామని భయపడుతూనే మెల్లిగా వచ్చాడు. సత్యభామలాగ ఎడమకాలితో తన్నిందో లేదో తెలీదు కాని, కాలపురుషుఁ డనుకొన్నంతపనీ జరిగింది. నిశాకాంత ఆవచ్చిన భర్తను సగిసరీతిగా సత్కరించలేదు కాబోలు. అతనిముఖమైనా సరిగ చూడలేదనుకొంటాను. తన కౌగిలి నీలేదు కాబోలు. తన్ను విడిచి పగటిపడుచువద్దకే వెళ్ళమందనుకొంటాను. కాలపురుషుఁడభిసారికావచనాలనే వ్యాజంతో నెంతో సేపు బ్రతిమలాడాడు. కాని నిశాకాంతకలహాంతరితయై ఒప్పుకోలేదు. బదులైనా పలుకలేదు. అందుకనే కాలపురుషుడు విసుక్కొని తన కర్మను తిట్టుకొంటూ గడబిడచేయకుండా పగటిపడుచు నొద్దకు జరిగిపోయాడు.

తమ్మాదరించు వారివద్దకు తలచుగాను, తొందరతోను ప్రేమిడితోను వెళ్లడం లోకంలో సహజమే కాదూ?